# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **యోగాంధ్ర కార్యక్రమానికి గిన్నిస్ రికార్డుల్లో స్థానం దక్కడం ప్రతి ఆంధ్రుడికీ గర్వకారణమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

**2.** **పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో మోడల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి పి. నారాయణ తెలిపారు.**

**3.** **గత పదేళ్లలో నూనె గింజల ఉత్పత్తి 55 శాతం, పప్పు దినుసుల ఉత్పత్తి 47 శాతం పెరిగిందని పార్లమెంటరీ కమిటీకి కేంద్ర ప్రభుత్వం తెలిపింది.**

**4.** **శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి 60 వేల 587 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.**

==========================

విశాఖపట్నంలో నిర్వహించిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో 3 లక్షల 105 మంది పాల్గొని సరికొత్త రికార్డ్ సృష్టించారని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంస్థ ప్రశంసించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ స్పందించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లలో విశాఖపట్నంలో నిర్వహించిన యోగాకు స్థానం దక్కడం ప్రతి ఒక్క ఆంధ్రుడికీ గర్వ కారణమని ముఖ్యమంత్రి అన్నారు. ఒక మంచి పని కోసం కలిసి పనిచేస్తే ఇటువంటి ఫలితాలు సాధించవచ్చని నిరూపించిన అందరికీ అభినందనలు అంటూ చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రపంచ రికార్డులను తిరగరాసి రాష్ట్రం సరికొత్త చరిత్ర సృష్టించిందని, బ్రాండ్ విశాఖ వేదికగా ఈ ఘనత సాధించామని మంత్రి లోకేష్ అన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలంటూ ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

--------------------------

రాష్ట్రంలోని పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు ఐదు ప్రాంతాలలో మోడల్ స్కూళ్లను.. ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. ఇందులో భాగంగానే నెల్లూరు నగరంలోని వి.ఆర్ హైస్కూల్‌ను అత్యున్నత ప్రమాణాలతో ఆధునికీకరిస్తున్నామన్నారు. హైస్కూల్ లో జరుగుతున్న పనులను ఆయన అధికారులతో కలిసి గత రాత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి

చంద్రబాబు నాయుడు నిర్ణయించారని తెలిపారు. నెల్లూరులో 20 కోట్ల రూపాయలతో విఆర్ హైస్కూల్ ను ఆధునికీకరిస్తున్నామని నారాయణ వివరించారు.

----------------------------

రేపు ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా కర్నూలులో ఈ రోజు ఒలింపిక్ ర్యాలీ నిర్వహించారు. ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ నుంచి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ జరిగింది. విద్యార్థులు, ప్రజలు పెద్దఎత్తున హాజరైన ఈ ర్యాలీలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది పాల్గొన్నారు. ప్రజలు, విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ..

.. వాయిస్...27 సెకన్లు

కాగా.. ఒలింపిక్ డే సందర్భంగా వారం రోజులు క్రీడా పోటీలు నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేశారు.

----------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 29వ తేదీన చిత్తూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఆ రోజు కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలంలో ఆయన పర్యటిస్తారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ మణికంఠ, కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో శ్రీనివాసరాజు, డీఎస్పీ పార్థసారథి చర్చించారు. శాంతిపురంలోని తుమ్మిశిరోడ్డు సమీపం రాళ్లబూదుగూరు రహదారిలో హెలిప్యాడ్ స్థలాన్ని నిన్న వారు పరిశీలించారు. అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

----------------------------

గడిచిన పదేళ్లలో పప్పు దినుసులు, వంట నూనెల ఉత్పత్తి పెరిగిందని పార్లమెంటరీ కమిటీకి ప్రభుత్వం తెలిపింది. వీటి కోసం అధికంగా భారత్ దిగుమతులపై ఆధారపడుతోందని పార్లమెంట్ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ సమాచారాన్ని కమిటీకి అందించింది. ఆ రంగంలో స్వయం సమృద్ధికి చేపట్టిన పనుల గురించి ఈ నెల 20వ తేదీన జరిగిన సమావేశంలో వ్యవసాయ మంత్రిత్వశాఖ నివేదిక అందించింది. గత పదేళ్లలో నూనె గింజల ఉత్పత్తి 55 శాతం, పప్పు దినుసుల ఉత్పత్తి 47 శాతం పెరిగిందని తెలిపింది.

----------------------------

శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు జూరాల డ్యామ్ పూర్తిగా నిండిపోవడంతో జలాశయం గేట్లను అధికారులు ఎత్తివేశారు. ప్రస్తుతం జూరాల నుంచి శ్రీశైలం జలాశయానికి 60 వేల 587 క్యూసెక్కుల నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 854.20 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 89.7132 టీఎంసీలకు చేరింది.

----------------------------

రైతుకు సుస్థిర ఆదాయం సమకూర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగమైన పాడి పరిశ్రమలో 'పెయ్య సాయం' పేరిట అదనపు లబ్ధి చేకూర్చనుంది. కేవలం ఆడ దూడలను మాత్రమే పుట్టించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. తొలుత చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలోని

ప్రతి పాడిరైతుకు ఆర్థిక లాభం చేకూర్చే దిశగా జాతీయ పాడి అభివృద్ధి మండలి..ఎన్‌డీడీబీ, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ఈ ప్రాజెక్టును చేపట్టాయి. ఈ నియోజకవర్గంలో ప్రస్తుతం రోజువారీ పాల ఉత్పత్తి 4 లక్షల 50 వేల లీటర్లు కాగా, నాలుగేళ్లలో పది లక్షల లీటర్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందుకోసం ఎన్‌డీడీబీ 52 కోట్ల రూపాయలు వెచ్చించనుంది.

---------------------------

ఏలూరు నగరంలోని కాలువలు, నీటివనరులు కలుషితం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్‌ను ఆదేశించారు. ఏలూరు నగరంలోని పలు ప్రాంతాల్లో కాలువలు, నీటివనరుల వద్ద పారిశుధ్య పరిస్థితులను నిన్న సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగరంలోని తమ్మిలేరు గట్లను ఆమె పరిశీలించారు. రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధించాలని, ఈ విషయం ప్రధాన కూడళ్లలో అందిరికీ తెలిసేలా బ్యానెర్లు ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

విశాఖ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మహా విశాఖ నగర పాలక సంస్థ.. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో నిన్న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వచ్చే ఆరు నెలల్లో విశాఖపట్నాన్ని అత్యంత పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు, వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారిస్తామని కేతన్ గార్గ్ చెప్పారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...30 సెకన్లు

=====================